క్లుప్తంగా

నేడు వెంకన్న కల్యాణానికి పెళ్లిరాట



ఉపమాక వెంకన్న ఆలయం

నక్కపల్లి: వచ్చే నెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉపమాక వేంకటేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలకు సంబంధించి పెళ్లి రాట(పందిరి రాట) వేసే కార్యక్రమం సోమవారం జరగనుంది. పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం సోమవారం 7.50 గంటలకు పెండ్లి రాట వేయడానికి నిర్ణయించినట్లు ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాషేకం, నిత్య కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం ఆస్థాన మండపం ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభం వద్ద పెళ్లి రాట వేస్తామన్నారు. వచ్చే నెల 10 నుంచి ఐదు రోజుల పాటు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. సుమారు 20 రోజుల పాటు ఉపమాకలో తిరునాళ్లు జరుగుతాయని ఆయన చెప్పారు. స్వామివారి కల్యాణోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

మునగపాకలో కొనసాగిన చెత్త సేకరణ



చెత్త సేకరణను పర్యవేక్షిస్తున్న అధికారులు

మునగపాక: ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం ఆదివారం కూడా మునగపాకలో నిర్వహించారు. గ్రామంలో అధికారులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడ చెత్తను సేకరించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ఆరోగ్యకర గ్రామంగా మునగపాక అభివృద్ధి చెందుతుందని సర్పంచ్ అప్పారావు పేర్కొన్నారు. పారిశుధ్యం మెరుగునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పలు శాఖల అధికారులు ఇంటింటా చెత్త సేకరణ చేపట్టారు.

గడ్డి కుప్ప దగ్ధం



మంటలు ఆర్పుతున్న గ్రామస్తులు

మునగపాక: మునగపాక బీసీ కాలనీలో వరిగడ్డి కుప్ప దగ్ధమైంది. బీసీ కాలనీలో ఆడారి పెంటారావు పాడి పశువులను పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆయనకు చెందిన గడ్డి కుప్పకు మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో సుమారు రూ.50వేలకు పైగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగచంద్రను పరామర్శిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: ఎస్.నర్సాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొల్లు నాగచంద్ర పాముకాటుకు గురై తుని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ఆయనను జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆదివారం పరామర్శించారు. అతని ఆరోగ్య విషయం అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ, పల్లేల వెంకట్, పల్లేల మనోజ్, తదితరులు ఉన్నారు.

పశు సంవర్ధక శాఖాధికారుల సంఘ జేఎస్‌గా రామకృష్ణకీర్తి



ఏడీ డాక్టర్ రామకృష్ణ కీర్తి

పరవాడ: ఏపీ పశు సంవర్ధక శాఖాధికారుల సంఘ సంయుక్త కార్యదర్శిగా పరవాడ పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ కీర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని లబ్బీపేటలో ఇటీవల జరిగిన సంఘ ఎన్నికల్లో తనను ఎన్నుకున్నట్లు ఆయన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పశుసంవర్ధక శాఖాధికారుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

శివ పూజకు సిద్ధం

- శైవ క్షేత్రాలకు శివరాత్రి శోభ
- ఆలయాల్లో 26న రుద్రాభిషేకాల నిర్వహణకు ఏర్పాట్లు



నామవరంలో వెలసిన స్వయంభూ రామలింగేశ్వర ఆలయం

నక్కపల్లి: శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఈ నెల 26న శివరాత్రి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. మహేశ్వరుడు లింగాకారంలో ఉద్భవించిన రోజు కాబట్టి మహాశివరాత్రి అంటారు. ఈ పర్వదినాన బోళాశంకరుడ్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో శివాలయాలు కిటకిటలాడుతుంటాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో ప్రాచీనమైన శైవ క్షేత్రాలున్నాయి. ఈ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు.

పాయకరావుపేట మండలం..

నామవరంలో స్వయంభూరామలింగేశ్వర ఆలయం ఉంది. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. దాదాపు నూరేళ్ల క్రితం ఇక్కడ శివుడు స్వయం వ్యక్తమై వెలసినట్లు పూర్వీకుల కథనం. స్థానికులు ఇక్కడ చిన్న పందిరి వేసి తర్వాత ఆలయం నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారు. దినదిన ప్రవర్ధమానమై పాయకరావుపేట, తుని పరిసర ప్రాంతాల భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. శివరాత్రి నాడు తెల్లవారుజామున 3 గంటల నుంచే ప్రత్యేక అభిషేకాలు చేస్తారు. ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగిస్తారు. సాయంత్రం 7 గంటలకు పార్వతీ కల్యాణం, రాత్రి లింగోద్భవ సమయంలో మహారుద్రాభిషేకం, రుద్రహోమం చేస్తామని ఆలయ అర్చకుడు శాస్త్రి తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆ రోజు మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ కూడా జరగనుంది.

- గోపాలపట్నం సమీపంలో సీతమ్మవారి మెట్టపై ధర్మలింగేశ్వర స్వామి ఆలయం కూడా ప్రాచీనమైనదే. ఇక్కడ కూడా శివరాత్రి నాడు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తాండవ నది ఒడ్డున ఉన్న కట్రాళ్లకొండపై పురాతన శివాలయం అయ్యప్పస్వామి ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ కూడా శివరాత్రి పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నక్కపల్లి మండలంలో..

ఉపమాకలో లక్ష్మణేశ్వరస్వామి ఆలయం, ఒడ్డిమెట్టలో కాశీవిశ్వేశ్వర ఆలయాలు ఉన్నాయి. గొడిచర్లలో శేషలింగేశ్వరాలయం, ఉపమాకలో కూడా ప్రత్యేక రుద్రాభిషేకాలు, హోమాలు చేయనున్నారు. బ్రహ్మతపస్సు చేసిన బంధుర సరస్సుకు అభిముఖంగా ఈ శివాలయం ఉండటంతో సరస్సులో స్నానమాచరించి భక్తులు పరమశివుడ్ని దర్శించుకుంటారు. శివరాత్రికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం చేయనున్నారు. ఒడ్డిమెట్ట కైలాసగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయంలో శివరాత్రి పర్వదినాన మహారుద్రాభిషేకం, రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణం ఘనంగా చేయనున్నారు. చినదొడ్డిగల్లులో ప్రతిష్ఠించిన రామలింగేశ్వర ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, కల్యాణం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.



నామవరంలో స్వయంభూ రామలింగేశ్వర స్వామి



ఉపమాకలో ఉన్న లక్ష్మణేశ్వరస్వామి ఆలయం

ఎస్.రాయవరం మండలంలో...

ఎస్.రాయవరం గ్రామంలో శ్రీకృష్ణదేవరాయలు ప్రతిష్ఠించిన పురాతన శివాలయం ఉంది. బుద్రేశ్వర స్వామిగా భక్తులు కొలుస్తుంటారు. పెద ఉప్పలంలో బలిచక్రవర్తి ప్రతిష్ఠించిన బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. ఈ రెండు చోట్ల శివరాత్రి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. రుద్రాభిషేకాలు, హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రేవుపోలవరం, రాజయ్యపేట, పెంటకోట, బోయపాడు సముద్ర తీరాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానమాచరిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

మోదకొండమ్మ తల్లి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న అంజి

మునగపాక: మునగపాక బైపాస్‌రోడ్డులో నిర్మిస్తున్న మోదకొండమ్మ తల్లి ఆలయానికి భక్తులు విరాళాలు అందిస్తున్నారు. మునగపాకలో జన్మించి వ్యాపార రీత్యా అచ్యుతాపురంలో స్థిరపడిన షేక్ అంజి ఆలయ అభివృద్ధికి తనవంతు సాయంగా రూ.10వేలను కమిటీ సభ్యులకు అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి సహకరించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: విద్యుత్ నిర్వహణ పనులు, కొత్త ఫీడర్ ఏర్పాటు పనుల నిమిత్తం పట్టణంలోని మిలట్రీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, ద్వారకానగర్, నెహ్రూ నగర్, ప్రధాన రహదారి ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించి ఆయా ప్రాంతాల్లో ఉన్నవారంతా నీళ్ల ట్యాంకులు, ఇతర అత్యవసర పనులకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆదివారం కూడా సెలవు లేదా?

- మాకు పిల్లలు, కుటుంబం ఉండదా?
- సచివాలయ ఉద్యోగుల ఆవేదన

మునగపాక: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారులపై పని ఒత్తిడి రోజురోజుకు పెరిగిపోతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం పలు పనులను సెలవు రోజుల్లో నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. తామూ పిల్లలు, కుటుంబ సభ్యులతో కనీసం ఆదివారం నాడైనా సరదగా గడుపుదామనుకున్నా తమకు సంబంధం లేని పనుల్లో భాగస్వామ్యం చేస్తున్నారంటూ సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకల్లా విధుల్లో ఉండాలని అధికారులు ఒత్తిడి చేయడంపై మండిపడుతున్నారు. పారిశుధ్యం ప్రత్యేక డ్రైవ్‌లో సచివాలయ ఉద్యోగులు ఉండాలన్న నిబంధన లేకున్నా స్థానిక అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తే పిల్లల ఆలపాలనా ఎవరు చూస్తారని వాపోతున్నారు. ఇప్పటికైనా పని ఒత్తిడి తగ్గించి విధులు నిర్వహించేలా చూడాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

ఏపీటీఎఫ్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఎస్.రాయవరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో మొదటి ప్రాధాన్యత ఓటును పాకలపాటి రఘువర్మకు వేసి గెలిపించాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్.ధర్మారావు కోరారు. లింగరాజుపాలెం, ఉప్పరాపల్లి, వెంకటాపురం గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు జి.సునీల్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గోవిందరావు, రామకృష్ణ, కోన నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణ పక్కాగా జరగాలి



సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్న డీపీవో శిరీషా రాణి

పాయకరావుపేట: తడి, పొడి చెత్త సేకరణ పక్కాగా జరగాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి శిరీషా రాణి అన్నారు. పాయకరావుపేట, నామవరం గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర సర్వేలో భాగంగా ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేయు విధానంపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి, వర్మీకంపోస్టు తయారీపై ఆరా తీశారు. ప్లాస్టిక్ బాటిళ్ల అమ్మకాలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆమె ఆదేశించారు. ఇల్లు, పరిసరాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, ఉంచుకోనేలా అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలోని కృష్ణ వీధి, శెట్టిబలిజి పేటలో తడి, పొడి చెత్తల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజినల్ పంచాయతీ అధికారి ఎస్ఎస్ఎస్ఎన్ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు ఆచారి, అప్పల శివరాం, జూనియర్ అసిస్టెంట్ కుమరాస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, సిహెచ్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించండి



పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరికి మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

యలమంచిలి రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పీడీఎఫ్ నాయకులు యలమంచిలి మండలంలో ఆదివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఏటికొప్పాక, సోమలింగపాలెం గ్రామాల్లో పీడీఎఫ్ నాయకులు ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పీడీఎఫ్ ప్యానల్ నాయకులు ఎల్లయ్య బాబు, శివాజీ, కర్రి అప్పారావు, బాలాజీ, రాణి, నాగ మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం గ్రంథాలయాధికారి డి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు గ్రంథాలయాధికారి తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు ఇచ్చి దగ్గరుండి చదివించారు. డ్రాయింగ్, ఆర్ట్స్, ఆల్బమ్స్‌పై అవగాహన కల్పించారు.

నాలుగోసారి రోడ్డు పనులు వాయిదా



రోడ్డుపై తేలిన నల్లపిక్కలు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు–నర్సీపట్నం రోడ్డు పనులు కాంట్రాక్టర్ మరో మారు వాయిదా వేశారు. అడ్డురోడ్డు నుంచి కోటవురట్ల మండలం రామచంద్రపురం శివారు వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు గతుకులమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత హోంమంత్రి అనిత పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు మరమ్మతులు చేయిస్తామని హామి ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలకు పైగా గడుస్తున్నా ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోలేదు. స్థానికులు ఒత్తిడి మేరకు కాంట్రాక్టర్ పనులు చేస్తున్నట్టు అక్కడక్కడ చేపట్టి వెళ్లిపోతున్నాడు. దీనిపై గతంలో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించి గడిచిన ఆదివారం చినగుమ్ములూరు–నీలాద్రిపురం సమీపంలో పనులు ప్రారంభించి నాలుగు రోజుల తరువాత ఆపేశారు. ఇలా ఈ రోడ్డు పనులు ఇప్పటికి నాలుగు సార్లు వాయిదా పడ్డాయి. తాజాగా చేసిన పనులతో వాహనచోదకులు కొత్త సమస్యలు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా బెర్మలు పెంచి చదును చేసి, గతుకులు చదును చేసి, పిక్క వేసి రోలింగ్ చేయకుండా వదిలేశారు. దీంతో రోడ్డుపై రాకపోకలకు వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. వాహనాల రాకపోకల సమయంలో కంకర పిక్కలు ఎగిరి పడుతున్నాయని, కళ్లలో దుమ్ము పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభించి పూర్తి చేస్తే బాగుంటుందని, లేకుంటే పాత పద్ధతినే ఉంచితే ఇంత సమస్య వచ్చేదికాదని చెబుతున్నారు. కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు



వెంకటాపురంలో చెరువు గట్టును తవ్వి తరలించుకుపోయిన మట్టి

ఎస్.రాయవరం: మండలంలో మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. వారాంతంలో వీటి తరలింపు రెట్టింపు స్థాయిలో ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. రోడ్డు నిర్మాణాల పేరుతో చెరువుల్లో మట్టి, కొండ గ్రావెల్స్ పెద్ద ఎత్తున తరలిస్తూ కూటమి నేతలు లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడిచిన ఆరు నెలులుగా జేవీపాలెం, వెంకటాపురం, ఉప్పరాపల్లి, గుడివాడ, దార్లపూడి, పెదగుమ్ములూరు, చినఉప్పలం, వమ్మవరం, పెదఉప్పలం తదితర గ్రామాల్లో నిత్యం తవ్వకాలు చేపడుతున్నారు. ఈ తవ్వకాలపై అధికారులకు ఫిర్యాదు వస్తున్నా చర్యలు శూన్యమని ఆయా గ్రామాలు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలను అరికట్టాలని కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలు అందించారు.

యాజమాన్య పద్ధతులతో మామిడి, జీడిమామిడిలో దిగుబడులు



రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో జిల్లా ఉద్యాన అధికారి ప్రభాకరరావు

సబ్బవరం: ఉద్యాన పంటలైన మామిడి, జీడిమామిడి తోటల్లో పూత దశలో తగిన యాజమాన్య పద్ధతులను పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి జి.ప్రభాకర రావు తెలిపారు. మండలంలోని సబ్బవరం జాగృతి సంస్థ కార్యాలయంలో సబ్బవరం, కోటపాడు, దేవరాపల్లి మండల రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా అందించే పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఆయా మండలాల్లోని రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులు సాగు చేస్తున్న టమాటా విస్తీర్ణం, మార్కెటింగ్‌పై రైతులు ఎదుర్కొనే సమస్యలు, రేట్లపై చర్చించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి కిరణ్మయి పాల్గొన్నారు.

సందర్శకులతో బొజ్జన్నకొండ కళకళ



బొజ్జన్నకొండకు తరలివచ్చిన సందర్శకులు

తుమ్మపాల: మండలంలో శంకరం వద్ద ఉన్న బొజ్జన్నకొండ ఆదివారం జిల్లా, రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో కళకళలాడింది. మెట్ల మార్గం మీదుగా కొండపైకి చేరుకుని రాతి గుహల్లోని బౌద్ధ స్థూపాన్ని దర్శించుకున్నారు. గుహల్లోని ప్రాచీన కట్టడాలను, అద్భుతమైన ఆర్కిటెక్చర్ శిల్పాలను తమ కెమెరాల్లో బంధించారు. బుద్ధుని జ్ఞాన మందిరం, వివిధ ఆకృత్తుల్లో బుద్ధుని విగ్రహాలు, బొజ్జన్న కొండ చరిత్రను తెలుసుకున్నారు. లింగాల కొండపై నిర్మాణాలు, కొండపై నుంచి చుట్టు పచ్చని పంట పొలాలను చూసి మురిసిపోయారు. కొండ దిగువన ఆహ్లాదకర వాతావరణంలో సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిగా గడిపారు. కొండపై గుహలు, మెట్ల వద్ద ప్లాస్టిక్ సీసాలు కుప్పలుగా పడేసి ఉన్నాయి. బుద్ధుని ప్రధాన మందిరం వద్ద పరిసరాలను శుభ్రం చేయకపోవడంపై సందర్శకులు అసహనం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో ఘనంగా ఒడ్డు పండగలు

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరు మోదమాంబ ఆలయం వద్ద ఆదివారం ఒడ్డు పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన పుట్టా కొండలరావు కుటుంబ సభ్యులు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సాగరం, ఘాట్‌రోడ్డు కాటా ఆవరణలో మోదమాంబకు ఒడ్డు పండగలు చేశారు.

కండక్టర్ నారాయణ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి



డిపో గేటు వద్ద నిరసన తెలుపుతున్న అసోసియేషన్ నాయకులు

అనకాపల్లి: ఆర్టీసీ అనకాపల్లి డిపోలో విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్ ఎస్.ఎస్.నారాయణ సస్పెన్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ కోరారు. స్థానిక డిపో గ్యారేజీ గేటు వద్ద ఆదివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ సస్పెన్షన్‌ను రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామన్నారు. అసోసియేషన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి జి.ఎస్.రావు, డిపో అధ్యక్షుడు ఎ.ఎస్.రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వరాహ పుష్కరిణి వద్ద వ్యర్థాల తొలగింపు



వరాహ పుష్కరిణి వద్ద వ్యర్థాలు తొలగిస్తున్న సంత్ నిరంకారీ సభ్యులు

సింహాచలం: సంత్ నిరంకారీ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థాన వరాహ పుష్కరిణి వద్ద వ్యర్థాలను తొలగించారు. ప్రాజెక్ట్ అమృత్, స్వచ్ఛ జలం–స్వచ్ఛ మనసు నినాదంతో సుమారు 200 మంది సేవాదళ సభ్యులు, వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సేవాదళ్ క్షేత్రీయ సంచాలకుడు డీఏఆర్ రవి మాట్లాడుతూ సద్గురు బాబా హరదేవ్‌సింగ్ మహారాజా జన్మదినాన్ని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా ఏటా ఫిబ్రవరి 23న క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈసారి సుమారు 15 వేల ప్రదేశాల్లో క్లీనింగ్ కార్యక్రమం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ ప్రతినిధులు రాజ్‌వీర్, జి.రాము పాల్గొన్నారు.